క్లుప్తంగా

నివాళి



మహదేవపూర్: మండలంలోని బెగుళూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ ఆకుల నారాయణ అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు గురువారం నివాళులర్పించారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోశారు.

నేటి నుంచి చిడతల రామాయణం ప్రదర్శన

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల గ్రామంలో శుక్రవారం నుంచి చిడతల రామాయణం ప్రదర్శన చేస్తున్నట్లు పలుగుల భక్త మండలి ఒక ప్రకటనలో తెలిపారు. చిడతల రామాయణం ప్రదర్శన గురువు దుర్గం సడవలయ్య ఆధ్వర్యంలో ఈనెల 9వరకు ప్రతిరోజు సాయంత్రం 6గంటల నుంచి రామాయణంలో పాత్రలను ప్రదర్శించనున్నారని తెలిపారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

టేకుమట్ల: ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే బహుజనుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు సంగి రవి కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ భరోసా సభకు ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి హాజరు కానున్నట్లు తెలిపారు. కావున ప్రతి బహుజనుడు హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మాడుగుల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి భిక్షపతి, కోశాధికారి కొలుగూరి సదానందం, సెక్టార్ కో కన్వీనర్ సంగి రవి వర్మ, బెనర్జీ, దీక్షిత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

'అవినీతి ఎమ్మెల్యేల పేర్లు బహిర్గతం చేయాలి'

భూపాలపల్లి అర్బన్: దళిత బంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల వివరాలు, పేర్లు బహిర్గతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బట్టు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అంబేద్కర్ సెంటర్‌లో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. దళిత బంధు పథకంలో ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడినట్లు సీఎం కేసీఆర్ మాట్లాడటం సిగ్గుచేటుగా ఉందన్నారు. ఒక్కో యూనిట్‌కు రూ.రెండు నుంచి రూ.మూడు లక్షలు వసూలు చేస్తున్నారని తెలిపారు. హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దోర్నాల భరత్, రాజ్‌కుమార్, శ్రావణ్, రాజు, శ్రావణ్ పాల్గొన్నారు.

పోస్టల్ శాఖ ద్వారా అనేక సేవలు

మొగుళ్లపల్లి: పోస్టల్ శాఖ ద్వారా ప్రజలకు అనేక సేవలు అందుతున్నాయని పోస్టల్ శాఖ పరకాల సబ్ డివిజన్ అధికారి రామ్మూర్తి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తపాలా శాఖ కార్యాలయంలో మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి భారత ప్రభుత్వం ఈ పథకం తీసుకొచ్చిందన్నారు. రూ.వెయ్యి నుంచి రెండు లక్షల డిపాజిట్ చేసుకోవచ్చని, ఈ డిపాజిట్‌పై రూ.7.5 శాతం వడ్డీ వస్తుందని తెలిపారు. పథకంపై విస్తృత ప్రచారం చేయాలని పోస్టల్ సిబ్బందికి సూచించారు. సమావేశంలో మొగుళ్లపల్లి సబ్ పోస్ట్ మాస్టర్ క్రిష్ణ, సంతోష్, బీపీఎంలు, ఎబీపీఎంలు పాల్గొన్నారు.

నరసింహ జయంతి



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని పెంటివాడలో నరసింహస్వామి జయంతి సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం రాత్రి భక్తులు భక్తిపాటలతో భజన కార్యక్రమం నిర్వహించారు.

ధాన్యంపై ధ్యాసేది ?

- పలు చోట్ల ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- అకాల వర్షాలతో తడిసి మొలకెత్తుతున్న ధాన్యం
- అన్నదాతలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



మార్కెట్‌కు తీసుకొచ్చిన ధాన్యం

చిట్యాల: రైతులు ఎంతో శ్రమకోర్చి ఆరుగాలం కష్టపడి పండించి మార్కెట్‌కు వరి ధాన్యం తీసుకొస్తే ఇంత వరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పండించిన ధాన్యంపై అధికారులకు, పాలకులకు ధ్యాసలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వరి ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటి వరకు ప్రారంభించడం లేదని.. ధాన్యం ఎప్పుడు కొంటారు సారు అంటూ.. రైతులు ప్రశ్నిస్తున్నారు. వరి ధాన్యాన్ని తీసుకొచ్చి ఇరవై రోజులు అవుతున్నా కొనేవారే లేరని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకొస్తే కొనుగోళ్ల ఆలస్యంతో అకాల వర్షానికి ధాన్యం తడిసి పోయి మొలకెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో దుక్కులు దున్ని వ్యవసాయ పంటలకు సిద్ధం కావాల్సిన తాము ఇప్పటికీ ధాన్యం కొనుగోళ్లు లేక నిరీక్షించాల్సిన దుస్థితి వచ్చిందని వాపోతున్నారు. ఇంత జరుగుతున్న కనీసం అధికారులు, పాలకులు స్పందించకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్, పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించి, ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కోరుతున్నారు.

మండలంలో కేటాయించిన కేంద్రాలు..

- పీఏసీఎస్ పరిధిలో.. అందుకుతండా, గిద్దెముత్తారం, జడల్‌పేట, చల్లగరిగ, దూద్‌పల్లి.
- మ్యాక్స్ పరిధిలో.. ఒడితల, నైన్‌పాక, నవాబుపేట.
- ఎఎంసీ పరిధిలో.. వ్యవసాయ మార్కెట్ యార్డు.
- ప్రస్తుతం మండలంలోని గిద్దెముత్తారం, అందుకుతండా గ్రామాల్లో మాత్రమే కొనుగోళ్లు ప్రారంభించారు.

రైతులపై కపట ప్రేమ



ప్రభుత్వం రైతులపై కపట ప్రేమ చూపిస్తూ రైతులను మోసం చేస్తున్నారు. ఇరవై రోజుల క్రితం మార్కెట్ తెచ్చిన వరిధాన్యం ఇంత వరకు కొనుగోలు చేయకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. మార్కెట్ వద్దనే రైతులు ఎన్ని రోజులు ఉంటారు. తొందరగా కొనుగోలు చేయకపోతే రైతుల పక్షాన పోరాటం చేస్తాం.

- గడ్డం కొంరయ్య, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి, చిట్యాల

వర్షం వస్తే తిప్పలైతంది..



పంట చేలలో కష్టం చేసి ప్రతి గింజను కాపాడి మార్కెట్‌కు తీసుకొస్తే ఇక్కడ కొనేవారే దిక్కులేరు. మార్కెట్‌కు తీసుకొచ్చిన గింజలు ఆకాల వర్షాల కారణంగా తడుస్తుంటే చాలా బాదేస్తుంది. పొద్దంతా ఆరబెట్టుడు, రాత్రాంతా కుప్పపోసి కవరు కప్పుడు. వర్షం వల్ల తిప్పలైతంది. అధికారులు తొందరగా కొంటే మిగతా వ్యవసాయ పనులు చేసుకుంటాం. రైతులపై జర కనికరం చూపాలి.

- ఓర్సు చేరాలు, రైతు, చిట్యాల

బ్యాంక్ సదుపాయాలపై ప్రజలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్

టేకుమట్ల: వెలిశాల గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు అధికారులు గురువారం గ్రామంలోని ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్ మాట్లాడుతూ.. ఖాతాదారులందరూ బ్యాంకులో తీసుకున్న వ్యవసాయ రుణాలను సకాలంలో చెల్లించి వడ్డీ రాయితీని పొందాలని తెలిపారు. ఖాతాదారులు రూ.435తో టీఎంజేజీబీవీ బీమా చేసుకున్నట్లయితే ఖాతాదారుడు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.రెండు లక్షలు వస్తాయని వివరించారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ రూ.వెయ్యి రూపాయలతో బీమా చేసుకుంటే ఖాతాదారుడు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.20లక్షల బీమా వర్తిస్తుందని వివరించారు. మహిళా సంఘాల బాధ్యులు రుణాలను సకాలంలో చెల్లిస్తే పావులా వడ్డీ చెక్కులను పొందవచ్చని తెలిపారు. ప్రతి ఖాతాదారు బీమా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ మంగేష్, ఫీల్డ్ ఆఫీసర్లు ప్రశాంత్, రవికుమార్, బ్యాంక్ మిత్ర రాజేందర్, గ్రామ దీపిక ఎల్లంకి సుమతి, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమానికి కృషి చేయాలి



అవగాహన కల్పిస్తున్న రాధిక

మల్హర్: వృద్ధుల సంక్షేమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సఖి కో ఆర్డినేటర్ సరిత, అంగన్‌వాడీ సీడీపీఓ రాధిక, తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీ రావుల కల్పన ఆధ్వర్యంలో గురువారం వయో వృద్ధుల సంక్షేమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు మమేకమై వృద్ధుల పోషణ, జీవన శైలిపై దృష్టి సారించి, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించాలని తెలియజేశారు. వృద్ధులు ఎవరూ నిరాధరణకు గురికాకుండా చూడాలని చెప్పారు. ప్రజాప్రతినిధులు ప్రధాన భూమిక పోషించి, చట్టాలపై అవగాహన కల్పించాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరిసింహమూర్తి, ఏపీఓ విక్రమ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్, ప్రజాప్రతినిధులు

చిట్యాల: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్‌రెడ్డి కోరారు. మండలంలోని గిద్దెముత్తారం, అందుకుతండా గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి, టేకుమట్ల జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డిలతో కలిసి గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. రైతులు అధైర్యపడొద్దని సూచించారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆరెపల్లి మల్లయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పోలవేని పోశాలు, పులి సునీతఅంజిరెడ్డి, సిద్దంకి భాస్కర్, ఎంపీటీసీ పప్పుల విజయలక్ష్మీసంజీవ్, పీఏసీఎస్ సీఈఓ మొగిలి, నాయకులు రాజునాయక్, కూర మహిపాల్‌రెడ్డి, అజ్మీరా నందూ నాయక్, సమ్మయ్య, పంచిక మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాన్ని వినియోగించుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ అశోక్

కాటారం: కంటివెలుగు శిబిరాన్ని గ్రామస్తులు వినియోగించుకోవాలని సర్పంచ్ అంగజాల అశోక్ కుమార్ అన్నారు. శంకరాంపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని కంటి వ్యాధుల నివారణ కోసం ముందస్తు చర్యలు పాటించాలని సూచించారు. శిబిరంలో ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు అందించి, అత్యవసరం అయినవారికి కంటి ఆపరేషన్‌కు రిఫర్ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాజమణి, వైద్యులు వంశీకృష్ణ, లింగమూర్తి, డీఈఓ మధుసూదన్, సాంబయ్య, ఏఎన్ఎం సునీత, వార్డు సభ్యుడు సంతోష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి చేయూత



సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

భూపాలపల్లి అర్బన్: పట్టణంలోని రెడ్డికాలనీకి చెందిన ఉప్పల కుమారస్వామికి గత ఏడాది క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎడమ కాలు కోల్పోగా అతనికి ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయం అందజేశారు. ఇంటికే శాశ్వతంగా పరిమితం కావడంతో కుటుంబ పోషణ భారంకావడంతోపాటు భార్య శ్రావ్య గర్భిణీ. దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతూ ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ ఆశ్రయించినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన ఫౌండేషన్ బాధ్యులు రూ.5వేలు, 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు ఇచ్చినట్లు వైస్ చైర్మన్ సాగర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ పోషన్న, సభ్యులు పాంతే ప్రవీణ్, సంపత్, రాకేష్, హరీష్, నాగరాజు, మధు, నీరజ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి అనుమతివ్వండి



వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మండలంలోని అటవీ గ్రామాలైన ఆజాంనగర్, పెగడపల్లి గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అధికారులు అనుమతి ఇవ్వాలని ఆజాంనగర్ గ్రామ సర్పంచ్ గోవిందుల రాజమ్మ గురువారం రాష్ట్ర అటవీశాఖ అధికారి(పీసీసీఎఫ్) డోబ్రియాల్‌ను కలిసి కోరారు ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో సర్పంచ్‌తో పాటు బీఆర్‌ఎస్ నాయకులు గోవిందుల శ్యామ్‌లు కలిసి మాట్లాడారు. ఆజాంనగర్ నుంచి పెగడపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. కాగా, అటవీశాఖ అనుమతులు లేవని రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయని సర్పంచ్ ఆందోళన వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె



కొడవటంచలో వినతి పత్రాన్ని సమర్పించుకుంటున్న జేపీఎస్‌లు

చిట్యాల: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మె గురువారం 7వ రోజు కొనసాగింది. ఇందులో భాగంగా రేగొండ మండలంలోని కొడవటంచ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి, దేవాలయంలో వినతి పత్రం అందజేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దేవుడిలాగా కరుణించి పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని మొక్కుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు దేవేందర్‌రెడ్డి, రాజేష్, కృష్ణ కాంత్, మహేష్, శివ, రవీందర్, అనిత, సరిత, మానస, రమ్య, సునిత, సునంద, సౌజన్య, స్వప్న, ఉదయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: తమను ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె గురువారం ఏడో రోజుకు చేరుకుంది. సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు బీజేపి రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగేళ్ల ప్రొబేషన్ పీరియడ్‌ని సర్వీస్ కాలంగా గుర్తించి వారిని రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో జేపీఎస్‌ల పాత్ర ఉందని, గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోరె రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షులు నరేష్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి మౌనిక, కార్యవర్గ సభ్యులు మమత, మౌనిక, శారద, అజీరాబేగం, అన్వర్, హేమంత్, శిరీష, దుర్గ భవాని, నాగార్జున, శ్రావణి, సుమత, ఇంద్రసేన, సునీల్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల/రేగొండ: రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె గురువారం ఏడో రోజు సందర్భంగా వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. టేకుమట్ల, రేగొండ పంచాయతీ కార్యదర్శులు రంగవల్లులతో నిరసన తెలిపారు.

అనంతరం పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా జూనియర్ పంచాయతీ కార్యదర్శులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకంగా ఉందని, పల్లెలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



మొగుళ్లపల్లి: సంఘీభావం తెలిపిన కీర్తిరెడ్డి



టేకుమట్లలో...



రేగొండలో....

క్షయవ్యాధిని నిర్మూలించాలి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న జగదీశ్

మహదేవపూర్: క్షయవ్యాధిని నిర్మూలించాలని అంబట్‌పల్లి పీహెచ్‌సీ డాక్టర్ జగదీశ్ సూచించారు. పెద్దంపేట గ్రామంలో క్షయ వ్యాధి నిర్మూలన అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, నిర్మూలన, సీజనల్ వ్యాధులతో ఉండాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్య, అంబట్‌పల్లి పీహెచ్‌సీ డాక్టర్ జగదీష్, పర్యవేక్షకుడు మాషుక్ అలీ, ఏఎన్ఎం శ్రీలత, ఆశావర్కర్లు సమ్మక్క, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



సమావేశాన్ని బహిష్కరించిన ప్రజా ప్రతినిధులు



ఖాళీగా ఉన్న కుర్చీలు

వెంకటాపురం(కె): మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చెరుకూరి సతీష్ కుమార్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా కేవలం ఐసీడీఎస్, అటవీశాఖ, పంచాయతీ రాజ్, రెవెన్యూ ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు మాత్రమే హాజరు కావడంపై ప్రజా ప్రతినిధులు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరు కాకపోతే మండలంలోని సమస్యలను ఎవరికి చెప్పాలని అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించేందుకు అధికారులు సహకరించడం లేదని జెడ్పీటీసీ పాయం రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరైయ్యేలా చర్యలు చేపట్టాలని వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సైన్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అడ్డూరి బాబు, తహసీల్దార్ అంటి నాగరాజు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, అధికారులు ఉన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి

వెంకటాపురం(కె): విద్యుత్ ప్రమాదాలకు నివారణ కోసం కృషి చేస్తామని, ప్రజలు విద్యుత్‌ను జాగ్రత్తగా వినియోగించుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఈ స్వామిరెడ్డి అన్నారు. గురువారం మండలం మండల పరిధిలోని చొక్కాల గ్రామంలో విద్యుత్ భద్రతా వారోత్సవాల అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యుత్ భద్రతపై అవగాహన పెంచడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. విద్యుత్‌ను అవసరాలకు అనుగుణంగా వాడుకోవాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. పొలంలో విద్యుత్ అంతరాయం ఏర్పడితే సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. తొందరపాటున సొంతంగా నిర్ణయాలు తీసుకుంటే ప్రమాదాల జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ సునీల్ కుమార్, సబ్ ఇంజనీర్ సూర్య ప్రకాష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



నగేశ్ మృతదేహం

కాటారం: కాటారం మండలం గుమ్మాళ్లపల్లికి చెందిన రేగొండ నగేశ్(32) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నగేశ్ గ్రామంలో పంప్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. దివ్యాంగుడైన నగేశ్ కొన్ని రోజుల నుంచి చేతులు, మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ భరించలేక మద్యానికి బానిసయ్యాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా వ్యాధి నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైన నగేశ్ మంగళవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నగేశ్ తండ్రి మాధవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.